# జిల్లాస్థాయి ప్రేమకథ

ఈ కథను చదువుతున్నప్పుడు మీకు కొన్ని సందేహాలు రావచ్చు. వీటికి తగిన సమాధానాలు చెప్పవలసిన బాధ్యతను నేను ఎట్టి పరిస్థితులలోనూ స్వీకరించననే "ప్రీ కండిషన్"తో ఈ కథకు హరిశ్రీకారం చుడుతున్నాను. హరిశ్రీ అని ప్రస్తావించడం వలన ఈ కథలో నాయకుడిపేరు హరి అనీ, నాయిక పేరు శ్రీ అనే శుభాక్షరంతో ఆరంభమవుతుందనీ మీరు అభిప్రాయపడితే పప్పులో కాలేసినట్లే. అసలు ఈ కథలో పాత్రల పేర్లు కానీ, స్థలాల వివరాలు కానీ ఏవీ ఉండవు.

పాత్రలపేర్లు గాని, స్థలాలపేర్లు గాని చెప్పకుండా ఎట్లా కథ నడుస్తుందన్న అనుమానం మీకు రావచ్చు. ఇది మిక్కిలి కష్టతరమైన... దుస్సాధ్యమైన విషయమే. ఇందువల్ల కథ ఎంతో బోర్‌కొడుతుంది కూడా. ఇప్పుడు రచయిత దీనావస్థ మీకర్థమై ఉండొచ్చు. మరికొంత కాలం జీవించాలనే "చిన్ని ఆశ" అతనికి ఉండటం సహజమే. వాస్తవంగా జరిగిన సంఘటనను చిత్రీకరించేటప్పుడు ఏరచయితకైనా ఇటువంటి చిక్కులు తప్పవు. సంఘటన జరిగిన ప్రదేశాలను గాని, పాత్రల పేర్లను గాని ఎందుకు చెప్పడం లేదో ఈ కథ సాంతం చదివితే మీకే అవగతమవుతుంది. ఇది మూడక్షరాల వాళ్ళ కథ. ఈ కథలోని ప్రధానపాత్రలు ఐ.ఎ.యస్., ఐ.పి.యస్. అంటూ పిలవబడే ఆలిండియా సర్వీసుకు చెందినవాళ్ళు. అమ్మో! అంత పెద్దవాళ్ళు. అమ్మో... అంత పెద్దవాళ్ళ గూర్చి కూడా కథలు వ్రాస్తారా? ఎందుకు రాయగూడదు? వాళ్ళూ ఈ జనసమూహంలో పుట్టి పెరిగారు. ఏదో ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాలని పోటీ పరీక్షల్ని వ్రాసారు; మూడక్షరాలు సంపాదించారు. వాళ్లల్లోనూ గొప్ప వ్యక్తులతోపాటు చౌకబారు వాళ్ళూ ఉంటారు. నిజాయితీపరులు కొందరుంటే మరికొందరు గుడినీ, గుడిలో లింగాన్నీ మింగేచోర శిఖామణులుంటారు. వీరిలోనూ దేశభక్తులు కొందరుంటే మరికొందరు దేశ ద్రోహులుంటారు. రకరకాల ప్రవృత్తులు గల వాళ్ళూ సాధారణ జనంలో ఉన్నట్లే, ఈ ఉన్నత వర్గంలోనూ ఉంటారు.

ఈ కథలోని ప్రధాన పాత్రలలో ఒకరు జిల్లా కలెక్టరయితే, మరొకరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్. సౌకర్యార్థం వీళ్లను కలెక్టర్, ఎస్.పి.గా పిలుద్దాం. మామూలుగా కథల్లో ఉన్నట్లే, ఈ కథలో గూడా ఒక నాయకుడూ, ఒక నాయికా ఉంటే, కలెక్టర్‌ను స్త్రీగాను, ఎస్.పి.ని పురుషుడుగానూ తొంబైశాతం మంది భావిస్తారు. అట్లా భావించటమూ సహజమే. కానీ, ఇట్లాగే ఉండాలన్న నియమమేమీ లేదు గదా! ఈ కాలంలో దాదాపు అన్ని రాష్ట్రాలలో

మహిళా ఐ.పి.యస్. అధికారులున్నారు. అందుకే ఈ కథలో మహిళా యస్.పి., పురుష కలెక్టర్ ఉన్నారని చెప్తే అది అసమంజసమేమీ కాదు. కానీ, ఎస్.పి. గా పురుషుడు, కలెక్టర్‌గా స్త్రీ ఉన్నారని చెప్పటానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఫర్వాలేదండీ; ఆ విషయం ఎట్లా ఉంటే మనకేమిటి? కథలోని పాత్రల కంటే కథే గదా మనకు ముఖ్యం. ఈ ఉన్నతాధికారులిద్దరూ పనిచేస్తున్న రాష్ట్రమేది అని మీరడుగుతారేమో? రాష్ట్రంలో ఏదైనా, జిల్లా మాత్రం తీవ్రవాదులు, అడవులు, అతిథిగృహాలు కలిగి ఉన్నదే. భారతదేశంలో తీవ్రవాదులు, అధికంగా ఉన్న రాష్ట్రాలు పంజాబ్, కాశ్మీర్‌లే. పూర్వోత్తర రాష్ట్రాల్లో గూడా ఈ తీవ్రవాద సమస్య ఉధృతంగా ఉన్నదే. నక్సలైట్స్ గూడా తీవ్రవాదులే గదా! నక్సలైట్స్ ఉన్న రాష్ట్రాల జాబితాలోకి బీహార్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్; మహారాష్ట్రలు వస్తాయి. భారతంలో అతినూతనంగా ఏర్పాటైన ఢిల్లీలో గూడా వీళ్ల సమస్య ఉండనే ఉంది.

మన కథలోని కలెక్టర్, ఎస్.పి.ల వయసు దాదాపు ఒకటే. వాళ్ళ వయసు ముప్పై ముప్పై అయిదు సంవత్సరాల మధ్య ఉంటుంది. ఇరువురూ వివాహితులే. నాయికకు ఇద్దరు కుమారులుంటే, నాయకునికి ఒక కూతురు ఉంది. నాయిక భర్త రాజధానిలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండు మూడు రోజులు సెలవు దొరికితే భార్యా పిల్లలను చూడటానికి జిల్లాకు పయనమైవస్తాడు. భార్యను చూడాలనే అభిలాష ఏమోతాదులో ఉన్నా పిల్లల్ని చూడాలనే ఆరాటం అతనిలో ఎంత అధికంగా ఉంటుందో తండ్రి పేగు బంధం తెలిసిన ప్రతివ్యక్తికీ అర్థమవుతుంది. నాయకుని భార్య మాత్రం అతనితోనే ఉంది. ఆ చిన్న కుటుంబం ఒక సంతృప్త కుటుంబం. భార్య భర్తను, భర్త భార్యను ఈ ఇద్దరూ వారి చిన్నారి పాపనూ ప్రాణప్రదంగా చూసుకొంటారు. నాయకుని పొడుగు దాదాపు ఆరడుగులు. అందుకు తగ్గ పటిష్టమైన శరీరం; లౌడ్‌స్పీకర్ పెట్టి చెప్పకపోయినా పౌరుషాన్ని చాటి చెప్పే పెద్ద మీసాలు... శ్యామల ఛాయకూ, నలుపుకూ మధ్య ఉండే రంగు... అందర్నీ ఆకట్టుకొనేట్టు ఉండే వదనం... అత్యంత ఆకర్షణీయమైన చిరునవ్వు. అమితాబ్‌బచ్చన్‌గొంతు.. ఎదుటివాడి గుండెల్ని సూటిగా తాకే హాస్య ధోరణి. పరులను పరిహాసం చేయని నైజం, అతను చెప్పే కొన్ని చతురోక్తులు ట్యూబ్‌లైట్ బుర్రలకు త్వరగా అవగాహనకావు. అతనితో మాట్లాడుతూ కూర్చొంటే సమయం ఎట్లా గడిచిపోతుందో గూడా స్పృహకు రాదు.

రోజూ ఉదయం టెన్నిస్ ఆడే జబ్బు అతనికి ఉంది. ఆ ఒక్క జబ్బు ఉండటంవలన వేరే రోగాలేవీ అతనికి సాధారణంగా రావు. మంచి ఆరోగ్యం, స్ఫురద్రూపం, సౌమ్య ప్రవర్తనల ద్వారా స్త్రీ పురుష భేదం లేకుండా సర్వుల్నీ ఆకర్షించే గుణం అతనిలో ఉంది. మంచి అధికారి అన్న పేరు గూడా అతను సంపాదించుకొన్నాడు. అతనిపై అధికారులకే గాక, క్రింద పనిచేసే సిబ్బందికి గూడా అతనిపట్ల మంచి అభిప్రాయముండేది.

ఇహ మన నాయిక విషయం; ఆమె కూడా మంచి ఆఫీసరే. ఆమె గూర్చి ఒకే ఒక విమర్శ వినిపిస్తుంది. ముక్కు సూటిగా పోయే వైఖరి ఆమెదని. నియమాలు, నిబంధనలు మనిషి సౌకర్యం కొరకే ఏర్పాటు చేయబడ్డవన్న విషయాన్ని ఆమె విశ్వసించేది కాదు. ప్రజాసేవకురాలిగా గాక, తానొక ప్రభుత్వ అధికారి నన్నట్లుగా ఆమె ప్రవర్తించేది. ఈ విషయాన్ని గూర్చి భర్త ఆమెతో ప్రస్తావిస్తే "మిష్టర్! సీనియాటిరీ లిస్టులో మీకన్నా నేను పైనున్నాను." అని సూటిగా సమాధానం చెప్పేది. "ఒక్క సీనియారిటీలోనే కాదు, అన్ని విషయాల్లోనూ నీవు నాపైన ఉండటమే నాకు సంతోషం" అంటూ అతను బదులివ్వటంతోటే వాళ్ళమధ్య శీతల సమరం ఆరంభమవుతుంది. ఆఘర్షణ ఒక వారమో, నెలో, మరెక్కువ కాలమో కొనసాగవచ్చు. అయితే, ప్రస్తుతం ఆ భర్తవైఖరిలో కొంత పరిపక్వత వచ్చింది; ఉద్యోగ సంబంధ విషయాలేవీ భార్యతో చర్చించకూడదన్న నిర్ణయం ఒకటి తీసుకోవడమే ఇందుకు ఉదాహరణ. సీనియారిటీలోనేగాక, స్నాతకోత్తర పట్టా పొందటంలోనే గాక, ఉన్నత కుటుంబం నుంచి ఆమె వచ్చినందువలన కేవలం సంతాన ప్రాప్తికి మాత్రమే ఆమెను సమీపించే ఒక భర్తగా ఉండటమే శ్రేయస్కరమని అతను తలపోశాడు. ప్రేమవివాహాలు శైశవం నుంచి మదురతరంగా ఉన్నా, బాల్యం చేదుగా పరిణమించి, కౌమారదశకు చేరేసరికి వెగటు కొట్టిపోవటానికి ఆస్కారముంది. మన నాయిక దాంపత్య జీవనం ఆదినుండీ అంత మధురంగా లేకపోయినందువలన ఒక్కసారే చేదు స్థితికి చేరకుండా, కొంచెం పుల్లగా, మరికొంచెం కారంగా ముందుకు సాగిపోతూ వుంది. మన నాయిక చూపులకు ఒక మోస్తరుగా ఉంటుంది. అయిదడుగుల అయిదంగుళాల ఎత్తు కలిగి ఉన్నదంటే స్త్రీలలో ఇది అసాధారణంగానే భావించాలి. కొంచెం సన్నగా ఉన్నందువలన చీర ధరించినపుడు ఆరడుగుల ఎత్తు ఉన్నట్లుగా ఆమె కన్పిస్తుంది. అయిదడుగుల ఆరంగుళాల కన్నా ఎత్తు తక్కువ వున్న పురుషులపై ఆమెకు చాలా చులకన భావం. తన కన్నా ఒకే ఒక అంగుళం ఎత్తు అధికంగా ఉన్న భర్తపట్ల ఆమె మనసులో ఎటువంటి అభిప్రాయాలున్నాయో తెలుసుకోవాలనుకోవటం మనకనవసరం. అతనింకా ఎత్తు పెరిగే అవకాశమే లేదన్న విషయం ఆమెకు తెల్సు. వివాహానికి ముందు అతని పట్ల గుడ్డి ప్రేమలో ఉన్నా, కనీసం చేతులతో తడిమి అయినా అతని ఎత్తును ఆమె అంచనా వేసుకోవచ్చు గదా! ఏమైనా పొడగరులైన దారాసింగ్, అమితాబ్‌బచ్చన్, రవిశాస్త్రిల పట్లవున్న గౌరవభావం తన పిల్లల తండ్రిపట్ల ఆమెకు లేనేలేదు.

ఆమె వంటిఛాయ చాలా మంచిది. శరీరంలో ఎక్కడెక్కడ వంపులు, సొంపులు వుండాలో అవ్వన్నీ ఆమెకు సవ్యంగానే ఉన్నాయి. ఎన్నడోగాని, కన్పించని చిరునవ్వును ఆమె ఎప్పుడైనా ప్రదర్శించినా అందులోనూ అధికార దర్పమే గోచరిస్తుంది. ప్రథమ పుత్రునికి ఆరు, ద్వితీయ

పుత్రునికి నాలుగు సంవత్సరాల వయసున్నప్పుడు ఆమె ఆ జిల్లా అధికారిగా నియమితు రాలైంది. ఆమె భర్త అక్కడకు చాలా దూరంగా ఉన్న రాజధానీ నగరంలో ఉద్యోగంచేస్తున్నాడు. ఇట్లా విడివిడిగా దూరదూరంగా ఉన్నాగానీ, ఆ విరహభావం వాళ్లల్లో ఏకోశానా కన్పించదు.

ఇహ ఆ జిల్లాలో ఎస్పీ, కలెక్టర్‌లు శాంతియుత సహజీవనం ఏవిధంగా కొనసాగిస్తున్నారో పరిశీలిద్దాం. వీళ్ళల్లో ఎవరు స్త్రీయో, ఎవరు పురుషుడో తెలిస్తే కథకొక కదలిక వచ్చేది. కాని, ఏంచేస్తాం? ఆ జిల్లా ఎస్పీ పురుషుడా, స్త్రీయా అనే విషయంగానీ, ఆ జిల్లా కలెక్టరుకు మీసాలా, గాజులా ఏవి ఉన్నాయన్న సంగతి గానీ, ఇప్పుడు కాదు, కథ పరిసమాప్తమయ్యే టప్పుడు గూడా తెలుసుకోలేము. అందుకనే, లింగభేదాల్ని పరిగణనలోకి తీసుకురాకుండా కథను కొనసాగిద్దాం. భారతదేశంలోని జిల్లాలన్నింటిలో జిల్లా కలెక్టరు అంటే జిల్లా మెజిస్ట్రేట్ జిల్లా ఎస్పీ గూర్చిన "కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్" వ్రాయటం పట్ల పోలీసు వ్యవస్థలోనే ఎంతో అసంతృప్తి, వ్యతిరేకతలేగాక, ఈ వైఖరి అన్యాయమైనదన్న భావం గూడా ప్రబలంగా ఉంది. కొద్దిమంది ఎస్పీలకు మాత్రం ఈ పద్ధతికి అయిష్టత చూపరు. దీనికి కారణమేమిటంటే, తమపై అధికారి అయిన డి.ఐ.జీ.లతో వాళ్ళకు సత్సంబంధాలు లేకపోవడమే. జిల్లా సర్వతోముఖాభివృద్ధికొఱకు ఎస్పీ, కలెక్టర్ లిరువురు పరస్పరం సఖ్యతతో పనిచేయటమనేది అత్యంతావశ్యకం.

మన నాయికా నాయకులిరువురూ ఎటువంటి అభిప్రాయ భేదాలు లేకుండా కలిసి పనిచేసేవారు. సభలు, సమావేశాలనే గాక, ఉద్యోగధర్మంగా ప్రతిరోజూ వాళ్ళు కల్సుకొనేవారు. నాయకుడు నాయికకు టెన్నిస్ క్రీడ అభ్యాసం చేసినందువల్ల ప్రతి దినం ప్రభాత సమయాలలో ఒక గంట కల్సి ఉండే అవకాశం వాళ్ళకేర్పడింది. అప్పుడప్పుడు నాయకుడు తన శ్రీమతిని గూడా కోర్టుకు తీసుకువచ్చేవాడు. ఆఫీసుల్లో వాళ్ళిరువురూ ఎల్లప్పుడు కల్సుకోవడం వింత ఏమీ లేదు గాని, ఇట్లా పొద్దుటి పూట క్రీడా మైదానాల వద్ద, స్విమ్మింగ్‌పూల్స్ వద్ద ప్రతిరోజూ కల్సుకోవడం మాత్రం మగ ఆఫీసర్ భార్యకుగానీ, ఆడ ఆఫీసర్ భర్తకు గానీ, అసూయ, అనుమానాలు కలగడం సహజమే గదా! నాయకుడు తన భార్యను క్రీడా మైదానానికి తీసుకురావడంతో భర్తపట్ల ఆమెకు విశ్వాసం సడలకపోవటమే కాక, నాయిక భర్తకు కూడా పెద్దగా అనుమానం రాకుండా ఉండేటట్లు చేసింది.

ఆ జిల్లాలో అరణ్యాలున్నందువల్ల, అక్కడ ఉగ్రవాదుల చర్యలు కొనసాగుతున్నందువలన ఈ ఇరువురికీ తరుచూ టూర్‌కు వెళ్లే అవసరమేర్పడేది. ఎక్కడికి వెళ్ళినా వేరు వేరు గదుల్లోనే వాళ్ళు విశ్రమించేవాళ్ళు; వాళ్ళ చుట్టూ పరిజనం గూడా ఉండేది; అందువల్ల వాళ్ళ విషయంలో ఎటువంటి సందేహం పడాల్సిన అవసరం లేదు.

తరుచుగా నాయిక, ఆమె ఇరువురు పిల్లలూ రాత్రి భోజనాలు నాయకుడి ఇంట్లోనే చేసేవారు. నాయిక భర్త కూడా ఇక్కడ ఉండటం తటస్థిస్తే ఇటువంటి విందుల్లో పాల్గొనేవాడు. అతనికి మన నాయకుని గుణగణాలపై గొప్ప అభిప్రాయముండేది. అప్పుడప్పుడు నాయకుడు, అతని భార్యా కూతురు నాయిక ఇంటికి వెళ్ళి రాత్రి భోజనం చేసేవారు. ఈ విధంగా ఈ రెండు కుటుంబాలవారు ఎంతో అన్యోన్యంగా, ఉల్లాస భరితంగా రోజుల్ని గడిపేవారు.

మన నాయికా నాయకులు ఈవిధంగా సుహృద్భావంతో సహజీవనం చేయటం ఆ జిల్లాలోని కొందరు అధికారులకే కాక, ఇతర జిల్లాలోని ఉన్నతాధికారులకు కూడా ఎంతో కంటగింపుగా ఉండేది. ఆ జిల్లాలోని పోలీస్, రెవెన్యూ సిబ్బంది గూడా వీళ్ళ అన్యోన్య జీవనంపట్ల చెవులు కొరుక్కొనేవాళ్ళు. వీళ్ళ అక్రమ సంబంధాన్ని సాక్ష్యాలతో సహా బహిర్గతం చేయలని కొందరు సిబ్బంది ఎంతగా ప్రయత్నించినా, అటువంటి అవకాశాన్ని మన నాయికా, నాయకులు వీళ్ళకేనాడు కల్పించలేదు.

అసలు నిజంగా ఏదైనా ప్రేమ బంధం ఇరువురి మధ్యా చిగురించి మొగ్గ తొడిగిందా? లేక మొగ్గతొడిగి చిగురించిందా? తనకు ప్రతిరోజూ ఎంతో చేరువగా సంచరిస్తున్న నాయకుణ్ణి జాగ్రత్తగా పరిశీలించి గానీ, సన్నిహితం గాకూడదని గతంలో నాయిక భావించింది. అతనెంత పెద్ద మొనగాడైనా తనముందు అతని పప్పులేం ఉడకవన్న ధీమాతో మన నాయిక ఉండేది. అతని కెటువంటి అతి చనువూ ఇవ్వకూడదని ఆమె తలపోసింది. ఒక అధికారి గానే తప్ప ఒక స్త్రీ అన్నభావంతో అతను ఆమెను చూడగూడదన్నదే ఆమె ఉద్దేశ్యం. ఇతనే గాదు; మరే పురుషుడైనా సరే ఒక అధికారిగా తన గౌరవ మర్యాదలు ఇచ్చి తీరాలన్నదే ఆమె భావం.

కానీ, కొంతకాలం గడిచేటప్పటికి ఆమె ఆలోచనా ధోరణిలో ఎంతో మార్పు గోచరించింది. "ఎంత మంచి అధికారి ఇతడు; భార్యాపిల్లలపట్ల ఎంత ఆదరాభిమానాలు చూపిస్తున్నాడు? భర్త అంటే ఇట్లా ఉండాలి; ఇటువంటి తండ్రి లభించడం ఆపాప అదృష్టం కాక మరేమిటి? ఓహ్... ఈ వ్యక్తిగత విషయాల మీదికి మనసు పోతున్నదేమిటి? ఇవ్వన్నీ నా కనవసరం గదా! కానీ, ఒక అధికారిగా కూడా అతనెంత ఉత్తముడు? ఇంత తక్కువ కాలంలో ఎంత మంచిపేరు సంపాదించాడు! అతన్ని ఇష్టపడని వాళ్ళు ఎవరైనా ఈ జిల్లాలో ఉన్నారా? ఎవరినోట విన్నా అతన్ని గూర్చిన ప్రశంసలే. విధి నిర్వహణ విషయాల అధికార దర్పం ఎన్నడైనా కన్పిస్తుందా? నా భర్తా ఒక అధికారే గదా! ఇంతగా ఆకట్టుకొనేట్లుగా అతను మాట్లాడగలడా? అతని ముఖంలో ఇంతటి ప్రసన్నత దర్శనమవుతుందా? ఇతడు నాపట్ల ప్రదర్శించే మర్యాదా, మన్ననలలో నూరవ వంతైనా నా భర్త చూపెట్టగలిగాడా?

ఇతను తన భార్యపట్ల చూపెట్టె ప్రేమానురాగాలలో పదవవంతైనా నాపట్ల నా భర్త చూపెడుతున్నాడా? మాది ప్రేమవివాహమే అయినా, సంవత్సరాలు గడిచే కొద్దీ మా మధ్య అంతరం పెద్దదవుతూనే వస్తున్నదే! అయినా, ఇవ్వన్నీ నేను భరించగలుగుతాను; కానీ అతని ఆత్మన్యూనతా భావాన్ని భరించడం మాత్రం నావల్ల కాదు. మా మధ్య జరిగే కలహాలకు ప్రధాన కారణం ఈ ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సే. సరే, భార్యాభర్తలన్న తర్వాత ఈ ఘర్షణలు రావడం సహజమే. పోనీ, తన వాదనే సవ్యమైనదని సమర్థించుకొనే శక్తైనా అతనికుందా? ఈ శక్తిలేదు గాబట్టే, అతను చేయగలిగిందల్లా అలిగి కూర్చోవడమే. పురుషత్వం అనేది ఇద్దరు పిల్లలని పుట్టించడంతోటే రుజువైపోతుందా? ఎత్తు తక్కువ ఉన్నవాళ్ళకుండే జబ్బే ఇది. ఎంత చదువుకున్నా, ఎంత హోదాలో ఉన్నా వీళ్ళలో ఆత్మవిశ్వాసం చాలా తక్కువగా ఉంటుంది. చదువులో, హోదాలో నాభర్త, ఇతడు సరిసమానంగానే ఉన్నారు. కానీ, నాభర్తలో ఉన్న ఆ న్యూనతా భావం అతన్నెంత అశక్తుణ్ణిగా మార్చివేసింది. దీనికి కారణమేమిటి? తన చుట్టూ ఉన్నవాళ్ళందరూ తనకంటే పొడగరులనీ, తనను చిన్నచూపు చూస్తున్నారనీ అతను భ్రమిస్తున్నాడు. మరోవైపు నా సహచరుడైన ఈ అధికారిని చూడండి; ఆరడుగుల స్ఫురద్రూపమే ఇతని క్కావల్సినంత ఆత్మవిశ్వాసాన్ని, మనోధైర్యాన్ని చేకూర్చిపెడుతూ ఉంది.

మైగాడ్..., ఏమైంది నాకీరోజు? మొదట్లో ఎటువంటి చనువూ ఇవ్వక దూరంగా ఉంచాలనుకొన్న "అతను" కాలం గడిచే కొద్దీ, అభిమాన భావం పెల్లుబికి "వారు" సంబోధన స్థాయికి ఎదిగి ఇప్పుడు మరీ "ఆత్మీకుడు"గా చేరువైనాడే! కానీ, ఒక మంచి వ్యక్తిని మిత్రుడుగా ఆదరించడంలో అసహజమేమీ లేదు గదా! ఈయన నాపట్ల ఎంత గౌరవంగా, మర్యాదగా వ్యవహరిస్తున్నాడు! ఎన్నో జన్మల అనుబంధం ఉన్నట్లు ఎంత సామీప్యమైపోయినాడు. ఇటువంటి ఆప్యాయతానురాగాలనే అతనిపట్ల ప్రదర్శించటం నా కనీసధర్మం కాదా! ఇంతటి ఉదార వ్యక్తులతో అనుబంధం కల్గి ఉండటం క్షేమదాయకమే. ఏమైనా ఇతని పట్ల నాకు ఆరాధనా భావం లేదని చెప్పటం నన్ను నేనే మోసగించుకొన్నట్లవుతుంది."

మన నాయిక మనసులో ఇంతటి సంక్షోభ భావతరంగ సృష్టికి ప్రేమ అని పేరు పెట్టటమే సమంజసం కదూ! కానీ, ఈ లవ్ ఒన్‌వే ట్రాఫిక్ వంటిదవుతుందా? అతని మనసులోనూ ఈమె స్థానం సంపాదించుకోగలిగిందా?

మన నాయకుడు పుట్టుకతోనే గౌరవభావాన్ని పుణికి పుచ్చుకొన్న వ్యక్తి. మర్యాద ఇచ్చి పుచ్చుకోవడం అతనికి వెన్నతో పెట్టిన విద్యే. మనసులో ఒకటి క్రియలో మరొకటి చేసే నైజం అతనిదికాదు. ఏ వ్యక్తితోనూ అమర్యాదగా వ్యవహరించే తత్త్వం కాదు అతనిది.

మానవజాతినే కాదు, సకల జీవరాశినీ ప్రేమించే స్వభావం అతనిది. ప్రకృతిలో విలీనమైపోయే సరళి అతనిది. ఇదంతా బాగానే ఉంది గానీ, ఈ మహిళా అధికారి గూర్చి అతని ఆలోచనలేమైనా ప్రత్యేకంగా ఉన్నాయా?

ఉన్నట్లేమీ కన్పించటం లేదు. రోజూ ఇంత సమీపంగా సంచరించే స్త్రీ పురుషుల మధ్య సహజంగా ఏర్పడే ఒక ఆత్మీయతానుభూతి లాంటిది. అతనిలోనూ కొంత కొంత పొడచూపింది. "ఈ స్త్రీ అధికారితో, ఒక పరిమితికి మించి ఎటువంటి చనువునూ నేను తీసుకోకూడదు. నాకు అనుకూలవతియైన భార్య ఉంది; ఎంతో అందమైన పాప ఉంది. అటువంటి మంచి భార్యను ఏనాడూ వంచించగూడదు. మరైతే ఈ మహిళా ఆఫీసరును నేనెందుకు టెన్నిస్ కోర్టుకు ఆహ్వానిస్తున్నాను. ఆమెతో ఎందుకంత అతి మధురంగా మాట్లాడుతున్నాను? ఆమెను నవ్వించే ప్రయత్నాలెందుకు చేస్తున్నాను, నేను? ఆమె చేతి వ్రేళ్లను స్పర్శించేటప్పుడు నాలో ఎందుకు పులకరింతలు కల్గుతున్నాయి? మా కరచాలనాలు ఎందుకంత అధికసమయం తీసుకొంటున్నాయి? అవసరమున్నా, లేకపోయినా ఈ కరచాలనాలీ మధ్య చాలానే అవుతున్నాయి. ప్రతిరోజూ గుడ్‌మార్నింగ్, గుడ్‌నైట్‌లు చెప్పుకొనే సందర్భాలలో ఇచ్చిపుచ్చుకొనే కరచాలనాలతో పాటు మా మనసులు గూడా ఆహ్లాదంగా ఎందుకు చరిస్తున్నాయి?

కానీ, ఇందులో తప్పు మాత్రం ఏముంది? ఆఫీసరంటే ఆఫీసరే; స్త్రీ పురుష వ్యత్యాసానికి ఇక్కడ స్థానం లేదు. ఒకచోట పనిచేసేటప్పుడు కరచాలనాలిచ్చుకోవటంలో గానీ, కల్సిమెల్సి మాట్లాడుకోవటంలో గానీ ఏ తప్పు ఉండదు.

కానీ, ఈ కొత్త సంబంధం కారణంగా నా భార్యకు నాకూ మధ్య ఉన్న అనుబంధానికి ఏదైనా లోపం ఏర్పడిందా? నో... నో... మునుపటికంటే, ఇంకా ఎక్కువగా, నా భార్యను నేను ప్రేమిస్తున్నాను.

అయతే ఈ కొత్త ప్రేమ ఎక్కణ్ణుంచి పుట్టుకొచ్చింది?

అంగీకరించక తప్పదు; ఈమెను నేను ప్రేమిస్తున్నాను; ఈ ప్రేమ దాహం రోజు రోజుకూ పెరుగుతూనే వస్తున్నది. కానీ, ఈ కారణంగా నాకూ నా భార్యకూ మధ్య ఉన్న ప్రేమ బంధానికి ఎటువంటి లోటూ కలగదు. భార్యను ప్రాణసమానంగా చూసుకొనే వ్యక్తి. వేరే స్త్రీని గాని, పురుషుణ్ణి గానీ, ప్రకృతినిగానీ, ఆరాధించ గూడదని ఏమైనా ఉందా? భార్యను ఇతరుల్ని ద్వేషించాలని ఎక్కడైనా ఉందా? అసలు, సమస్త లోకాన్నీ ద్వేషించే వ్యక్తి భార్యను మాత్రం ప్రేమించగలుగుతాడా?

ప్రేమ అనేది ఒక నిర్ణీత పరిమాణంలో ఇమిడిపోయేది కాదు; జ్ఞానాన్ని ఇతరులకిచ్చే కొద్దీ అది ఎట్లా పెరిగి పెద్దదవుతుందో, ఈ ప్రేమా అంతె; మనం ప్రేమను పంచే కొద్దీ అది వ్యాపితమవుతూనే ఉంటుంది.

నాతో పనిచేస్తున్న ఒక ఆడది... యువతి... రూపసి... నాసామీప్యంవల్ల ఆమెకు సంతోషం లభిస్తూ ఉంటే నాకూ ఆనందమే కదా! ఆమె ఉల్లాసాన్ని అధికం చేయటానికి నేను ప్రయత్నం చేస్తున్నాను; దానివల్ల నేనూ ఉల్లాసాన్ని పొందుతున్నాను. ఒక ఆడది నానుంచి ఇంత శాంతిని పొందుదామనుకున్నప్పుడు దానిని అందించలేనంత మూర్ఖుణ్ణి కాదు నేను.

ఈ స్త్రీతో ఏర్పడ్డ బంధాన్ని నేనూ కావాలనే పెంచి పెద్దచేస్తున్నానే; ఇది నా భార్యను మోసగించటం కదా? కానే కాదు; ఒకటి ఉద్యోగసంబంధమైనదైతే, రెండోది కేవలం వ్యక్తిగతమైనది. డోంట్‌మిక్స్ యువర్ అఫిషియల్‌వైఫ్ విత్ యువర్ పర్సనల్ వైఫ్.. ఓహ్... ఇది చాలా మంచి పాలసీనే. నేనొక స్త్రీకి భర్తనైనంత మాత్రాన "యానిమల్ హజ్బెండరీ డిపార్ట్‌మెంట్"లో పనిచేయగూడదని ఏం లేదే. గృహం స్వర్గంగా భావించినప్పుడు ఆఫీసును నరకంగా చేసుకోవాల్సిన అవసరమేమీ లేదు. ఈ సమర్థనలన్నీ బాగానే ఉన్నాయి. ఆమె వక్షస్థలంపైని కొంగు కొంచెం పక్కకు తొలిగితే ఆవైపే దొంగచూపులు చూస్తూ ఉండిపోవటం నా బలహీనత కాదా? ఇటువంటి స్థానభ్రంశాలు ఈ చీరెలకు ఇటీవలి కాలంలో పరిపాటి అయింది. ఏమిటీ ఆమెకింత అజాగ్రత్త? నాతో మాట్లాడేటప్పుడు ఆమె పెదాలపై ఒక కొత్త మెరుపును గమనిస్తున్నానే; ఆమె నా ముందు నడుస్తూ పోతున్నప్పుడు ఆమెతో సమానంగా నడవాలన్నది నేనెందుకు ప్రయత్నించటం లేదు?

ఆమె నాకెంత చేరువ అయినా, దానివల్ల నాకు ధననష్టమో, గౌరవ హాని జరుగుతుందని ఏ జ్యోతిష్కుడూ చెప్పలేదే!!"

ఈ విధంగా తనని తాను సమర్థించుకోవటం అతనికి చాలా తేలికన్పించింది.

నాయికా నాయకుల మధ్య ఉన్న ఆ కాస్త దూరం గూడా మరింత దగ్గరైంది. ఏ విషయం ఆలోచించటానికైనా, ఆచరించటానికైనా వాళ్ళల్లో ఎటువంటి తడబాటు లేదు. తమ సామీప్యం బహిర్గతం కాగూడదని ఇరువురూ నిర్ణయించుకొన్నారు.

ఓ రోజు వాళ్ళిద్దరూ జిల్లా సరిహద్దుల్లో ఒక ప్రాంతంలో క్యాంపు చేసారు. తమ అధికార కార్యకలాపాలన్నింటినీ పగలు పూర్తిచేసుకొన్నారు. సాయంకాలం స్నానాదులు ముగించుకొని చక్కగా ముస్తాబు చేసుకొని ఒక ప్రయివేటు కారులో ఆ ఇద్దరూ ఎక్కడికో

ప్రయాణం కట్టారు. డ్రైవింగ్ సీటులో ఎస్.పి. అంటే ఎస్.పియే నాయకుడని భావించవద్దని మనవి.

ఆ రోజువరకూ తలపెట్టని ఇటువంటి కృత్యానికి ఆ ఇరువురూ పాల్పడ్డంతో సిబ్బంది యావత్తూ ఆశ్చర్యపోయారు. ఆశ్చర్యపోవటమే గాదు, చెప్పరానంత ఆందోళనలో అల్లాడిపోయారు. ఉగ్రవాదుల కార్యకలాపాలు తీవ్రస్థాయిలో ఉన్న ఆ ప్రదేశంలో పోలీసు రక్షణ లేకుండా డ్రైవరు తోడు లేకుండా, కనీసం వైర్‌లెస్ సెట్ అయినా తీసుకెళ్ళకుండా ఈ ఇద్దరు ఉన్నతాధికారులూ ఇట్లా బయలు దేరటం ఎంతో ప్రమాదమని వాళ్ళు భయపడ్డారు.

కలెక్టర్‌గారి క్యాంప్‌క్లర్క్ చాలా బుద్ధిమంతుడు. ఒక ఫారెస్ట్ గెస్ట్ హౌస్ గూర్చి ఆ మధ్యాహ్నం కలెక్టర్‌గారు ఎవరినో అడుగుతుండగా ఈ క్యాంప్ క్లర్క్ వినటం జరిగింది. సాయంత్రం వాళ్ళ కారు ఏ దిశకు పోతున్నదో గూడా అతను గమనించాడు. ఆ మార్గంలో ఏభై అవరై కిలోమీటర్ల వరకూ ఆ ఫారెస్ట్ గెస్ట్ హౌస్ తప్ప వేరే ఎటువంటి గెస్ట్ హౌస్ లేదన్న విషయం అతనికి బాగా తెల్సు. ఆ గెస్ట్‌హౌస్ వ్యవహారాలను చూసే అధికారికి ఫోన్ చేసి కలెక్టర్ గారికి ఎటువంటి సదుపాయాలను ఏర్పాటు చేశారని ప్రశ్నించాడు. ఆ క్యాంప్‌క్లర్క్. ఆ రాత్రి జరగబోయే అతిరహస్య సమావేశం కొరకు ఆ గెస్ట్‌హౌస్ నంతా శుభ్రంచేసి ఒక్క వాచ్‌మెన్‌ను మాత్రమే అక్కడ ఉంచటం జరిగిందని ఆ అధికారి సమాధాన మిచ్చాడు.

అసలైన సంఘటన ఇహ ఇక్కడ నుండే ప్రారంభం అవుతుంది. మన సౌకర్యార్థం ఈ కథలో కొన్ని పేర్లను గూడా ఇప్పటినుండీ మనం బహిర్గతపర్చుకోవచ్చు. కలెక్టర్ గారి క్యాంప్‌క్లర్క్ పేరు సి.సి. ప్రసాద్. అతని పేరుకు ముందు సి.సి. అని ఉండటం వలన ఒక్క కలెక్టర్‌కే గాక, అందరూ అతనిని "సి.సి." అనే పిల్చేవారు. ఇహ ఏ మాత్రం ఆలస్యం చేయకుండా సి.సి. ప్రసాద్, జిల్లా కేంద్రంలో ఉండే తన ఆప్తమిత్రుడు ఎస్.ఆర్. పరమగురుతో టెలిఫోన్‌లో మాట్లాడాడు.

అసలు ఈ ఎస్.ఆర్. పరమగురు ఎవరూ? పరమ దుష్టుడూ, పరమ మూర్ఖుడూ కాదన్న సంగతి అతని పేరును బట్టే తెలుస్తూ ఉంది. ఎస్.ఆర్ అన్న అక్షరాలు అతని ఇంటి పేరును గానీ, తండ్రి పేరును కానీ సూచించవచ్చు. ప్రజలు మాత్రం అతన్ని ఆ అక్షరాలను బట్టి స్టాఫ్ రిపోర్టర్ అని పిలుస్తారు. అందుకు ఒక కారణం లేకపోలేదు. అతను ఒక వార్తాపత్రికకు పనిచేస్తూ ఉన్నాడు. పరిశోదనాత్మక జర్నలిజంలో అతనికి ప్రత్యేకమైన ఆసక్తి ఉంది.

రహస్యాల లోతుల్లోకి దిగటం, అతిరహస్యాల చిక్కు ముడులన్నింటిని విడదీయటం,

సాలెగూళ్లల్లా అల్లుకొని పోయిన ముసుగులన్నింటినీ తుడిచివేసి వాస్తవాలను వెలికితీయడం, ఈ పనుల్లో అతనెంతో ఉత్తేజితుడయ్యేవాడు. ఒక మంచి పత్రికా రచయితగా అతనికి ఆ జిల్లాలోనే గాక రాష్ట్ర వ్యాపితంగా చక్కనిపేరు ఉంది.

సి.సి. ప్రసాద్‌తో ఈ పరమగురువు చాల సన్నిహితంగా వ్యవహరించేవాడు. జరిగిన విషయాన్నంతా పరమ రహస్యంగా పరమగురువుకు చెప్పిన తర్వాత "ఈ వ్యవహారం ఇహ నీవే చూసుకో. ఎంత సమర్థంగా దీనిని ఉపయోగించుకొంటావో నాకూ చూడాలని ఉంది. సంచలనాత్మకమైన వార్త అంటే పరమగురువుకు పరమ సంతోషం. పదినిముషాల పర్యంతం దీర్ఘాలోచనలో పడిపోయాడతను. తర్వాత అతను అడిషనల్ ఎస్.పి. కె.పి. గుహ ఇంటికి సుడిగాలిలా పరిగెత్తుకు వెళ్ళాడు.

"సార్, ఇప్పుడు నేను చెప్పబోయే విషయం మీరు చాలా శ్రద్ధగా వినాలి; వెంటనే తగు చర్య గూడా తీసుకోవాలి మీరు. నూటికి నూరుపాళ్ళు విశ్వసనీయమైన సమాచారం ఇది. ఈ రాత్రికి ఉగ్రవాద రాష్ట్ర నాయకులు ఆగస్త్య పాదారణ్యంలోని ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌లో రహస్యంగా సమావేశం గాబోతున్నారు. అర్ధరాత్రి వరకూ ఈ సమావేశం కొనసాగుతుంది; తెల్లవారుజామున ముందే వాళ్ళుపారిపోతారు."

కొద్దిగా సందేహిస్తూ, "ఈ విషయం నీకెట్లా తెల్సు?"అని ప్రశ్నించాడు అడిషినల్ ఎస్.పి.

"ఇటువంటి ప్రశ్నలేవీ ప్రస్తుతం మీరు వేయవద్దు. అతి రహస్యంగా దాడి జరపటానికి త్వరగా సిద్ధం కండి. దీని ఫలితం ఎంతో ఆశ్చర్యకరంగా ఉంటుంది; అట్లా ఉండకపోతే నా చెవులు నేనే కోసుకుంటాను."

"నీవు చెవులు కోసుకుంటే నా కొచ్చేదేముంది? ఎస్.పి.గారు ప్రస్తుతం ఆ ప్రాంతంలోనే ఉన్నారు. ఫోనులో గానీ, వైర్‌లెస్‌లో గానీ ఈ విషయం ఆయనకు తెలియజేస్తాను."

"సార్... నేనిక్కడికి పరుగెత్తుకు వచ్చిన కారణం ఏమిటి? ఇటువంటి విషయాలు ఫోనులో మాట్లాడగూడదనే గదా! వైర్‌లెస్‌లో చెప్తే ఉగ్రవాదులకే ముందు తెల్సిపోతుంది. లేకపోతే మీ వాళ్ళే ఎవరైనా ఆ సమాచారాన్ని ముందు వాళ్ళకందిస్తారు. ఇందుకోసమే ఈ విషయాన్ని ఎవరితోనూ మీరు ప్రస్తావించవద్దు. వెంటనే మీరు ఒక జీపు, ఒక ట్రక్కు సిద్ధం చేయండి. ఇరవైమంది మనతో ఉంటే సరిపోతుంది. ఆ గెస్ట్ హౌస్‌కు కొంచెం ముందు ఒక రోడ్డు మలుపు ఉందికదా! అక్కడ దాకా జీపు, ట్రక్కు తీసుకుపోవచ్చు. దానికి కొంచెం ముందే "హెడ్‌లైట్స్" ఆఫ్ చేయాలి. ఈ రాత్రి మంచి వెన్నెలతో ఉన్నందువల్ల హెడ్‌లైట్స్

లేకపోయినా కొంచెం దూరం ప్రయాణించవచ్చు. ఆ తర్వాత ఒక పదిపదిహేను నిముషాలు నడవాలి. మనవాళ్లను మామూలు బూట్స్ కాకుండా కాన్వాస్ షూస్ వేసుకోమని ధైర్యం చెప్పాలి. నాలుగువైపుల నుండి ఆ గెస్ట్‌హౌస్‌ను చుట్టుముట్టి లొంగిపొమ్మని వాళ్ళను హెచ్చరించాలి. అన్ని వైపులనుండి ఫ్లాష్‌లైట్స్ గూడా ఆ గెస్ట్‌హౌస్‌మీద పడాలి. ఆ గెస్ట్‌హౌస్ నుండి వాళ్ళు బయటపడటానికి వెనుక, ముందు మార్గాలను చక్కగా కవర్‌చేస్తే వాళ్ళు తప్పించుకుపోవటానికి అవకాశమే ఉండదు.

"ఏమయ్యా! నీవే ఒక పెద్ద పోలీసాఫీసర్‌లాగా మాట్లాడుతున్నావే. సరే, ఒక ట్రయల్‌చేసి చూద్దాం. ఒక ముప్పావు గంటలో బయలుదేరుతాం. కానీ, నీవూ నాతో ఉండాలి. నీకు భయమేం లేదు గదా! తుపాకీ గుండ్లకు దిశాజ్ఞానం ఏమీ ఉండదు. ఉగ్రవాదులు తుపాకీతో గర్జిస్తున్నప్పుడు, వాటికి పత్రికా రచయితల్ని ముట్టుకోగూడదన్న పట్టింపేమీ ఉండదు." అంటూ తన మీసాల్ని మెలివేస్తూ బిగ్గరగా నవ్వాడు, గుహ.

ఒక గంటలోపలే పోలీస్ పార్టీ బయలుదేరింది. దారి పొడుగునా పరమగురు, గుహ ఈ విషయం గూర్చే మరింత వివరంగా చర్చించుకొన్నారు. రాత్రి పదకొండు గంటల సమయంలో పోలీసుపార్టీ ఆ గెస్ట్ హౌస్‌ను నాలుగువైపుల నుండీ చుట్టుముట్టింది. ఫ్లాష్‌లైట్లు ఆ అతిథి గృహాన్ని వెలుగులో ముంచెత్తాయి. ముందనుకొన్నట్లుగా తుపాకీ గుండ్లేవీ లోపల్నుండి బయటకు దూసుకు రాలేదు.

గుహ స్వయంగా మైకు ద్వారా హెచ్చరికచేసారు "వందలాది మంది సాయుధపోలీసులు చుట్టుముట్టి ఉన్నారు. ప్రతిఘటించకుండా లొంగిపొండి. మీరందరూ చేతులు పైకెత్తుకొని బయటకువస్తే ఎవరికీ ప్రాణహాని జరుగదు."

అడిషినల్ ఎస్పీ ఈ విధంగా మూడుసార్లు హెచ్చరికచేశారు కానీ లోనుండి ఏవిధమైన ప్రతిస్పందనా రాలేదు. అందిన సమాచారం తప్పుగదా; గెస్ట్‌హౌస్‌లో ఎవరూ లేరు గదా! అనే సవాళ్ళు "గుహ" బుర్రమీసాల క్రింద ఉన్న గుహ్వరం నుండి వేటకుక్కల్లా విరుచుకుపడి పరమగురును పీడించసాగాయి.

అతిథిగృహం ముఖద్వారం తెరచుకొంది. ఎన్నో తుపాకులు ఊపిరి బిగపట్టి నిరీక్షిస్తున్నాయి. చేతులు పైకెత్తుకొని ఇరువురు వ్యక్తులు నెమ్మదిగా బయటకు వచ్చారు. వాళ్ళిద్దరూ ఎస్పీ, కలెక్టర్లన్న విషయం గుహ వెంటనే పసిగట్టాడు. భగవంతుడా... ఇదేమిటి? .. వీళ్ళిద్దర్నీ ఉగ్రవాదులు బందీలుగా ఉంచారా! వీళ్ళ వెనుకగా మరెన్ని తుపాకులు బారులు తీరి ఉంటాయో యేమో! ఇటువంటి భయాందోళనలతో నిండిన ఆలోచనలతో గుహ ముక్కు

చెవులు, కళ్ళనుండి వెచ్చని ఆవిర్లు కమ్ముకు వచ్చాయి. ఈ పరిస్థితిలో తన సారథ్యంలో జరుగుతున్న ఈ దాడి పూర్తిగా విఫలమైపోతుందేమో!

ఏమిటీ ఆశ్చర్యం! ఆ ఇద్దరు ముందుకు వస్తూనే ఉన్నారు; మెట్లు దిగి మైకులో గుహ హెచ్చరిస్తున్న దిశవైపుకే తలలు వంచుకొని అడుగులేస్తున్నారు. వాళ్ళ వెనుకగా ఏ మర తుపాకులూ గురిపెట్టి లేవు. కలెక్టర్, ఎస్పీ మెట్లు దిగి కొంత దూరం రాగానే పోలీసులు ఒక్కుమ్మడిగా అతిథి గృహం సమీపానికి చేరి దాన్ని చుట్టుముట్టారు. గెస్టహౌస్‌లో నుండి ఏ చిన్న శబ్దం వెలికి వచ్చినా, కదలిక కన్పించినా దానిని ఎదుర్కోటానికి పోలీసుల తీక్షణ నేత్రాలు, తుపాలకు నోళ్ళు సంసిద్ధమై ఉన్నాయి. మరికొందరైతే ప్రాణాలను సైతం లక్ష్య పెట్టక గెస్టహౌస్‌లోకి దూసుకుపోవటానికి కాచుకొని ఉన్నారు. పరిస్థితులిట్లా ఉండగా పరమగురు చేతిలో ఉన్న కెమెరా చురుగ్గా తన పని తాను చేసుకుపోతున్న వైనాన్ని గుహ గమనించనేలేదు.

గుహను సమీపించిన ఎస్పీ కంఠం నుండి తీవ్రస్థాయిలో ఈ ప్రశ్న బయటకు వచ్చింది. "వాట్ నాన్సెన్స్ ఈజిట్ మిస్టర్ గుహ?"

"మిమ్మల్నిద్దర్నీ వాళ్ళు బందీలుగా పట్టుకు పోతే చర్య తీసుకోకుండా ఉండగలమా! ఇంతపనికి సాహసించిన ఆ ఉగ్రవాదులెవర్నీ ప్రాణాలతో వదిలిపెట్టం," అని గుహ ఉద్రేకంలో చెప్తుండగా, పరమగురు అదరాలపై ఒక పరమహాసం లాస్యం చేసింది.

"ఎవరూ మమ్మల్ని నిర్బందించలేదు. గెస్టహౌస్ లోపల వేరెవ్వరూ లేరు. మేమిక్కడ ఒక నైట్ హాల్ట్‌కి వచ్చాం; వాచ్‌మెన్, అతని క్వార్టర్‌లో ఉన్నాడు" అంటూ ఎస్పీ కంపిత స్వరం సమాధానం పలికింది. ఈ లోపు పోలీసులు గెస్టహౌస్ లోకి వెళ్ళి లైట్లన్నీ వేశారు. వాళ్ళ తీవ్ర ఆశాభంగానికి ఊరడింపుగా ఒక్క ఎలుకైనా దాని కలుగునుండి బయటకు రాలేదు. ఇంత తతంగానికి కారణమేమిటో తెల్సుకోవాలని ఆ అతిథి గృహం మాత్రం భయంతో నిలువెల్లా వణికిపోసాగింది.

కలెక్టర్ ఎస్పీ లిరువురూ వాళ్ళ కారులో బయలుదేరారు. అడిషినల్ ఎస్పీ జీపు ఆ కారుకు రక్షణగా పోసాగింది. ట్రక్కులో వచ్చిన పోలీసు సిబ్బంది రక్తరహితమైన ఆ ఎన్‌కౌంటర్ గురించి ఏవేవో చెప్పుకొంటూ, నవ్వుకొంటూ జిల్లాకేంద్రానికి తిరో ముఖమయ్యారు.

పగలంతా నివాసమున్న ఇన్‌స్పెక్షన్ బంగ్లాకు తిరిగి వచ్చిన ఎస్పీ కలెక్టర్‌ల గొంతులు సంపూర్ణంగా తడారిపోయాయి. అయినా గానీ, అడిషినల్ ఎస్పీ గుహను వెంటనే జిల్లా కేంద్రానికి తిరిగి వెళ్లమని ఎస్పీ కంఠం ఆదేశించింది. ఇహ మరింత ఆలస్యం చేయకుండా

ఎస్పీ కలెక్టర్ లిరువురూ తమ తమ కారుల్లో జిల్లా కేంద్రానికి ప్రయాణమయ్యారు. ఈ సంఘటన వల్ల అత్యంత ఆహ్లాదం పొందింది ఒక్క సి.సి.ప్రసాదే. ఆశ్చర్యం! ఈ విషయం గూర్చిన ఏ చిన్న వార్తాగూడా మరుసటిరోజు ఏ దినపత్రికలోనూ దర్శనమీయలేదు. కానీ, ఆ మరుసటి రోజు మాత్రం పత్రికల్లో ఈ వ్యవహారం సంక్షిప్తంగా ప్రచురితమైంది.

మరో నలభై ఎనిమిది గంటల్లో ఎస్పీ కలెక్టర్ లిరువురూ రాజధానికి బదిలీ అయ్యారు.

ఈ సంఘటన ఎస్పీ కలెక్టర్‌ల కుటుంబాల్లో తీవ్ర కల్లోలాన్ని సృష్టించింది. కానీ, సంసార జీవితంలో భార్యా భర్తల మధ్య ఇటువంటి అగ్ని పరీక్షలు ఎదురవటం సహజమే కదా!

పరమగురు చేతిలో ఆనాటి ఫోటోలు పరమ రహస్యంగా ఈ రోజువరకూ ఉన్నట్లు వార్త. అమాయకులైన ఆ ఎస్పీ, కలెక్టర్‌లను బ్లాక్‌మెయిల్ చేయాలన్న ఆలోచన అతని మస్తిష్కంలో ప్రవేశించనే లేదు.